# బాలబాలికలకు ఇస్లాం పరిచయం



Bala Balikalaku Islam Parichayam
(Telugu)

# బాలబాలికలకు
# ఇస్లాం పరిచయం

రచన

**అబ్బాదుల్లా**

**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్ (రిజిష్టర్డ్)**
సందేశభవనం, లక్కడ్‌కోట్,
హైదరాబాద్-500 002. ఫోన్: 24564583

**Bala Balikalaku Islam Parichayam**

**TIP Series No.** : **212**

Author : Abbadulla

All Rights Reserved with Publishers

**2nd Edition** : **December 2012**

Copies : 2000

**Price** : **Rs.25**

ISBN : 978-81-88241-63-7

Published by : **Telugu Islamic Publications Trust** (Regd.)
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 24564583
Fax : +91 +040 + 24576237
e-mail: tiphyderabad@rediffmail.com

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

# తొలిపలుకులు

అల్లాహ్ కృపవల్ల మనము ముస్లిములము. మన ధర్మం ఇస్లాం. ఇస్లాం సత్యధర్మం. ఇస్లాంను అనుసరించువారు ముస్లింలు. అంటే అల్లాహ్ ఇచ్చిన ఆజ్ఞల్ని ఆలకించి పాలించేవాడే ముస్లిం. మనమందరం అల్లాహ్‌కు విధేయులం. ఆయనిచ్చిన ఆజ్ఞల్ని పాటిస్తాం.

అల్లాహ్ సర్వోత్తమ గుణాలు కలవాడు. ఆయన మంచికి పుట్టినిల్లు. సత్ప్రవర్తన అంటే ఆయనకెంతో ఇష్టం. మంచి పనులు చెయ్యమని, చెడుకు దూరంగ ఉండమని శాసించాడు కూడ. ఆయన చెప్పింది చేయడం మన వంతు. అప్పుడే సౌశీల్యం మనకు అలవడు తుంది. అల్లాహ్ మనల్ని అమితంగ ప్రేమిస్తాడు. అల్లాహ్ ప్రేమకు పాత్రులయ్యాక అందరి ప్రేమాదరణలు మనకుంటాయి. అజ్ఞానులు అల్లాహ్ పట్ల విశ్వాసం కలిగి ఉండరు. ఆయన ప్రబోధనల్ని పెడచెవిన పెట్టి వాటిని అనుసరించేందుకు నిరాక రిస్తారు. వీరినే కాఫిర్లంటారు. సత్యాన్ని కప్పిపుచ్చేవాడు తిరస్కారి (కాఫిర్). దైవ తిరస్కారి మంచివాడు కాజాలడు. సత్యానికి దూరంగ అసత్యానికి చేరువగ ఉంటాడు.

అందుచేతనే దైవతిరస్కారులంటే అల్లాహ్ ఇష్టపడడు. వారంటే అల్లాహ్ ఆగ్రహిస్తాడు. అల్లాహ్ ఆగ్రహం పొందేవారికి శిక్ష ఉంటుంది. ఆ శిక్షనుండి రక్షించేవారెవరూ ఉండరు.

అల్లాహ్ ఆజ్ఞలు జవదాటకుండా నడుపమని, చెడుకు దూరంగ ఉంచమని, మంచివారిగ, సజ్జనులుగ చేయమని అందరి ప్రేమకు నోచుకునే భాగ్యం కలుగాలని మనమందరం ప్రార్థిద్దాం.

- ప్రకాశకులు

అనంతకరుణామయుడు అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

# బాలబాలికలకు ఇస్లాం పరిచయం

ఇస్లాం ఒక పద్ధతి. మానవాళి కోసం అల్లాహ్ నియమించిన విధానం. ఇస్లాం అరబీ పదం. ఇస్లాం అంటే తనకు తాను సమర్పించుకోవడం. ఇందులో విధేయత భావం ఉంది. స్వయం సమర్పణతోబాటు విధేయతతో అల్లాహ్ పట్ల విశ్వాసం కలిగి ఉండటానికే ఇస్లాం అని అంటారు.

## సమర్పణ అంటే:

అల్లాహ్ ఇచ్చిన ఆదేశాలకు తలొగ్గడం

## విధేయత అంటే:

అల్లాహ్ ఆజ్ఞల్ని తు.చ. తప్పకుండ పాటించడం.

అల్లాహ్ పట్ల వినమ్రత విధేయత కలిగి ఉండటం వల్ల మానవాళికి శాంతి చేకూరుతుంది.

ఇస్లాం విశ్వశాంతి ప్రదాత. శాంతి సమకూర్చే ఈ పద్ధతికి కట్టుబడి ఉండటం విశ్వాస బంధం.

ఈ అనుబంధం అరబ్బీ భాషలో "లా ఇలాహ ఇల్లల్లాహ్ ముహమ్మదుర్రసూలుల్లాహ్" అని పిలువబడుతుంది.

దీని అర్థం:

**అల్లాహ్ తప్ప ఇతర ఆరాధ్య దైవం లేడు.**
ముహమ్మద్ (సఅసం)అల్లాహ్ పంపిన ప్రవక్త.

ఇస్లాంను అనుసరించేవారు, అల్లాహ్ పట్ల విశ్వాసం కలిగి ఉంటారు.

ఆయన్నే ఆరాధిస్తారు. ఆయనను తప్ప ఇతరులను పూజించరు.

ముహమ్మద్ (సఅసం) అల్లాహ్ పంపిన అంతిమ ప్రవక్త అని విశ్వసిస్తారు.

ఈ మార్గం శాంతి మార్గం. సంపూర్ణ జీవిత విధానం.

ప్రపంచంలో మానవుడు జీవించేంతవరకు మానవుడు చెయ్యవలసిన పనులను తెలిపే విధానం.

ఈ విధానం అనుసరించిన వారికి శాంతి, సంతోషాలు అపారం.

# ముస్లిం

'ముస్లిం' ఒక అరబ్బి పదం.

తనకు తాను సమర్పించుకొనే వ్యక్తి ముస్లిం.

ఈ సమర్పణ కేవలం అల్లాహ్‌కు మాత్రమే.

ఇస్లాం ననుసరించే వ్యక్తి ముస్లిం.

**ముస్లిం విశ్వాసం:**

అల్లాహ్ ఒక్కడే ఆరాధ్య దైవం.

ముహమ్మద్ (సఅసం) అల్లాహ్ పంపిన ప్రవక్త

అల్లాహ్ తప్ప ఇతర ఆరాధ్యదైవం లేదు.

మహాప్రవక్త ముహమ్మద్ చివరి ప్రవక్త ఈ విశ్వాసానికి సాక్ష్యం పలుకడం విశ్వాస వచనం.

ముస్లిం విశ్వాస వచనం: أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ
وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا رَّسُوْلُ اللّٰهِ

**అష్‌హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహు వ అష్‌హదు అన్న ముహమ్మదు రసూలుల్లాహ్.**

దీని అర్థం:

నేను సాక్ష్యం ఇస్తున్నా అల్లాహ్ తప్ప ఇతర ఆరాధ్య దైవం లేదు. మరియు నేను సాక్ష్యం ఇస్తున్నా ముహమ్మద్ (సఅసం) అల్లాహ్ పంపిన ప్రవక్త.

## ముస్లిం ఆచరణ:

అల్లాహ్ ఆజ్ఞలను అనుసరించడం.

అల్లాహ్ ఇచ్చిన ఆదేశాలు ఖుర్ఆన్ గ్రంథంలో ఉన్నాయి.

ముస్లిం ఖుర్ఆన్ పఠనం చేస్తాడు.

దైవాజ్ఞలను పాటిస్తాడు.

ముహమ్మద్ (సఅసం) అల్లాహ్ పంపిన ప్రవక్త అని విశ్వసిస్తాడు.

ముహమ్మద్ (సఅసం) చేసిన ప్రబోధనలననుసరిస్తాడు.

ముస్లిములందరూ ఈ మార్గాశ్రయితులే.

వారందరూ ఏకేశ్వరోపాసన పట్ల ధృఢ చిత్తులు.

ముహమ్మద్ సత్య సందేశ వహుడని అల్లాహ్ ప్రవక్త అని విశ్వసిస్తారు.

ఒకే పద్ధతిననుసరించే వారిని అరబ్బీ భాషలో ఉమ్మహ్ (ఉమ్మత్) అని అంటారు.

ముస్లింలందరూ ఒకే పద్ధతి పాటించే సమాజికుల్లో ఒక భాగం

వీరందరు విశ్వాసం గల ఒకే ఒక వర్గం.

వీరందరు పరస్పరం సోదరులు, ఒకే వర్గపు ప్రజలు కూడా.

# ముస్లిం విశ్వాసం

ముస్లిం విశ్వాసం ఐదు ఆధారాలపై ఉంది.

ఈ ఆధారాలు నిత్యసత్యాలు.

ఇవే అల్లాహ్ పట్ల మనకున్న నమ్మకాన్ని, విశ్వాసాన్ని తెలుపుతాయి.

ప్రతి ఆధారం ఒక సత్యాన్ని నిర్వచిస్తుంది.

ఈ నిర్వచనం కలిమ అనబడుతుంది.

కలిమ అంటే పదం, పలుకడం అని అర్థం.

## మొదటి కలిమ:

ఈ కలిమ విశ్వాసాన్ని నిర్వచిస్తుంది.

దీనినే 'కలిమ అత్తయ్యిబ' అని అరబ్బీలో అంటారు.

'అత్తయ్యిబ' అరబ్బీ పదం.

దీని అర్థం మంచిది, స్వచ్ఛమయింది.

కలిమ అత్తయ్యిబ ఇలా ఉంది:

لَآ اِلٰـهَ اِلَّا اللّٰهُ مُحَمَّدٌ رَّسُوْلُ اللّٰهِ

**"లా ఇలాహ ఇల్లల్లాహు ముహమ్మదుర్రసూలుల్లాహ్"**

దీని అర్థం: అల్లాహ్ తప్ప ఇతర ఆరాధ్యదైవం లేడు.

ముహమ్మద్ (సఅసం) అల్లాహ్ సందేశవహుడు.

## రెండవ కలిమ సాక్ష్యం పలుకడం:

ఈ సాక్ష్యపు వాంగ్మూలాన్ని

'కలిమ అష్షహాదహ్' అని అంటారు.

'అష్షహాదహ్' అరబీ పదం.

దీని అర్థం సాక్ష్యం ఇవ్వడం.

కలిమ అష్షహాదహ్ ఇలా ఉంది:

اَشْهَدُ اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ
وَاَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ

**'అష్హదు అన్ లా ఇలాహ ఇల్లల్లాహు వహ్దహు లాషరీకలహు**

**వఅష్హదు అన్న ముహమ్మదన్ అబ్దుహూ వ రసూలుహు'**

దీని అర్థం:

అల్లాహ్ తప్ప ఇతర ఆరాధ్యదైవంలేడని నేను సాక్ష్యం పలుకుచున్నా.

ఆయన ఒక్కడే, ఆయనకు సాటి ఎవరూ లేరు.

ముహమ్మద్ ఆయనకు దాసుడు, ఆయన సందేశవహుడని నేను సాక్ష్యం పలుకుచున్నా.

ఈ విశ్వాసం ఇలా ఉంది:

ఒక్క అల్లాహ్ తప్ప మరెవ్వరూ ఆరాధ్యదైవాలు కారు.

ముహమ్మద్ (సఅసం) అల్లాహ్కు దాసుడు, ఆయన సందేశ వహుడు కూడా.

# ముస్లిం విశ్వాసం

మూడవ కలిమా: కలిమ అత్ తమ్‌జీద్

అల్లాహ్ ఘనతను తెలిపే వాక్యం.

سُبْحَانَ اللّٰهِ وَالْحَمْدُ لِلّٰهِ وَلَآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَاللّٰهُ اَكْبَرُ
وَلَا حَوْلَ وَلَا قُوَّةَ اِلَّا بِاللّٰهِ الْعَلِيِّ الْعَظِيْمِ

"సుబహానల్లాహి వల్‌హమ్దులిల్లాహి వలా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్ వలాహౌల వలా ఖువ్వత ఇల్లాబిల్లా హిల్ అలియ్యిల్ అజీమ్"

దీని అర్థం:

సకల స్తుతులు, స్తోత్రాలు అల్లాహ్‌కే చెల్లును.

అల్లాహ్ తప్ప ఇతర ఆరాధ్య దైవం లేడు.

ఆయనే అందరికంటే గొప్ప.

ఆయన ప్రసాదించేదే అధికారం, శక్తిసామర్థ్యం.

ఆయనే మహోన్నతుడు, మహోజ్వలుడు కూడ.

ముస్లిం అల్లాహ్‌ను స్తుతిస్తాడు, ఆయన స్తోత్రాలనే వల్లిస్తాడు. ఆయన ఒక్కడే మహోన్నతుడు. ఆయన ప్రసాదిస్తేనే అధికారం, శక్తి ఉంటుంది.

**నాల్గవ కలిమ:** కలిమతుత్ తౌహీద్.

'అత్ తౌహీద్' అరబీ పదం.

ఏకేశ్వరోపాసన తెలిపే వాంగ్మూలం.

لَا اِلٰهَ اِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ لَهُ الْمُلْكُ وَلَهُ
الْحَمْدُ يُحْيِىْ وَيُمِيْتُ بِيَدِهِ الْخَيْرِ وَهُوَ عَلٰى كُلِّ شَيْئٍ قَدِيْرٌ

" లా ఇలాహ ఇల్లల్లాహు వహ్దహు లాషరీక లహుల్ ముల్కు వలహుల్‌హమ్దు యుహీవయుమీతు బియది హిల్ ఖైర్ వహువ అలాకుల్లి షైయిన్ ఖదీర్ "

దీని అర్థం:

అల్లాహ్ తప్ప ఇతర ఆరాధ్య దైవం లేడు.

ఆయనే విశ్వానికి ప్రభువు, అధినేత.

ఆయన ఒక్కడే, ఆయనకు సమానులు ఎవరూ లేరు.

జీవన్మరణాలు ఆయన అధీనంలోనే ఉన్నాయి.

ఆయన చేతుల్లోనే శ్రేయం ఉంది.

ఏది తలచిన చేసే శక్తి ఆయనకే ఉంది.

ఒక ముస్లిం అల్లాహ్ తప్ప మరే ఆరాధ్య దైవం లేదని, సకల స్తుతిస్తోత్రాలు ఆయనకే చెల్లుతాయని, ఆయన విశ్వపాలకుడని, జీవన్మరణాలు ఆయన అధీనంలోనే ఉన్నాయని, తలచినది చేసే శక్తి ఆయనకే ఉందని ధృవీకరిస్తాడు.

ఐదవ కాలిమా:

దీనిని కలిమ-ఎ- ఇస్తిగ్‌ఫార్ అంటారు.

ఈ కలిమా క్షమాపణకు అభ్యర్థన

'ఇస్తిగ్‌ఫార్' అంటే క్షమించడం.

اَللّٰهُمَّ اِنِّیْ اَعُوْذُبِكَ مِنْ اَنْ اُشْرِكَ بِكَ شَیْئًا وَّاَنَا اَعْلَمُ
بِهٖ وَاَسْتَغْفِرُكَ لِمَا لَا اَعْلَمُ بِهٖ اِنَّكَ اَنْتَ عَلَّامُ الْغُیُوْبِ
تُبْتُ عَنْهُ وَتَبَرَّاْتُ عَنْ كُلِّ دِیْنٍ سِوٰی دِیْنِ الْاِسْلَامِ
وَاَسْلَمْتُ وَاَقُوْلُ لَا اِلٰهَ اِلَّا اللّٰهُ مُحَمَّدٌ رَّسُوْلُ اللّٰهِ

"అల్లాహుమ్మ ఇన్నీ అవూజుబిక మిన్ అన్ ఉష్రిక బిక షైఅన్ వ అన ఆలము బిహీ వఅస్తగ్ఫిరుక లిమా లా ఆలము బిహీ ఇన్నక అన్తల్ అల్లాముల్ గుయూబ్ తుబ్తు అన్హు వ తబర్రాతు అన్కుల్లిదీనిన్ సివాదీనిల్ ఇస్లామి వ అస్లమ్తు వఅఖూలు లాఇలహ ఇల్లల్లాహు ముహమ్మదుర్రసూలుల్లాహ్"

ఈ కలిమ అర్థం:

తెలిసో తెలియకో ప్రత్యక్షంగ, పరోక్షంగ నేను చేసిన పాపాలను క్షమించమని ఓ నా ప్రభూ! నిన్నర్థిస్తున్నా.

ఓ ప్రభూ! నాకు తెలిసిన, తెలియని పాపాల నుండి క్షమాపణ కోరుచున్నా, నిశ్చయంగ నీకు అన్నీ తెలుసు.

మానవుల గుప్త విషయాలు నీకు తెలుసు. మాలోని రుగ్మతల్ని, కొరతల్ని దాచి పెట్టువాడవు నీవే. అన్ని దోషాలను, పాపాలను మన్నించి క్షమించేవాడవు నీవే. అల్లాహ్ నుండి తప్ప ఏ బలం, ఏ శక్తి ఎవరికీ లేదు.

నీవు తప్ప మరెవ్వరూ ఆరాధ్య దైవాలు కారని, ముహమ్మద్ (స) నీ ప్రవక్త అని విశ్వసిస్తున్నాను, అంగీకరిస్తున్నాను.

నీవే మహోన్నతుడు, అందరికంటే గొప్పవాడవు.
చేసిన పాపాలను క్షమించే వాడు అల్లాహ్ మాత్రమే.
ముస్లింలు ఆయన్నే క్షమించమని శరణు వేడుతారు.
ఆయనే మహోన్నతుడు, గొప్పవాడు.
ఆయనే సర్వశక్తికి, బలానికి మూలకారణం.
ఆయన తప్ప మరెవ్వరూ లేరు అని విశ్వసిస్తారు.

# సంపూర్ణ విశ్వాసం

"సంపూర్ణ విశ్వాసం" అంటే ఏమిటో ముస్లింలకు తెలియాలి.
దీనిని అరబ్బీలో 'అల్-ఇమాన్-అల్ ముఫస్సిల్' అని అంటారు.
ఈమాన్ అంటే విశ్వాసం, నమ్మకం అని అర్థం.
ముస్లింలకు అల్లాహ్‌పై విశ్వాసం, నమ్మకం ఉంది.
విశ్వాసం కలిగి ఉండడం అంటే అల్లాహ్ పట్ల అచెంచలమైన ఏకాగ్రతతో కూడిన నమ్మకం కలిగి ఉండడం అన్నమాట.
అరబీ భాషలో ఇలా ఉంది:

اٰمَنْتُ بِاللّٰهِ وَمَلَائِكَتِهِ وَكُتُبِهِ وَرُسُلِهِ وَالْيَوْمِ الْاٰخِرِ
وَالْقَدْرِ خَيْرِه وَشَرِّهِ مِنَ اللّٰهِ تَعَالٰى وَالْبَعْثِ بَعْدَ الْمَوْتِ

"ఆమన్తు బిల్లాహి వ మలాయికతిహీ వకుతుబిహీ వరుసులిహీ వల్‌యౌమిల్ ఆఖిరి వల్ ఖద్రి ఖైరిహీ వషర్రిహీ మినల్లాహి తఆలా వల్ బాసి బాదల్ మౌత్"

దీని అర్థం

'నేను అల్లాహ్ పట్ల, ఆయన దూతల పట్ల, ఆయన గ్రంథాల పట్ల,
ఆయన సందేశ వహుల పట్ల, తుది దినం పట్ల,
మంచి లేదా చెడు చేసే శక్తి అల్లాహ్ నుండే అనడం పట్ల,
మరణానంతర జీవితం పట్ల విశ్వాసం కలిగి ఉన్నాను.'

అందుచేత ముస్లిం ఈ ఏడు విషయాలను విశ్వసిస్తాడు.

1. అల్లాహ్ ఒక్కడే (తౌహీద్)
2. ఆయన దూతలు (అల్ మలాయిక)
3. అల్లాహ్ అవతరింపజేసిన అన్ని గ్రంథాలు (కుతుబుల్లాహ్)
4. అల్లాహ్ పంపిన అందరు సందేశవహులు (రసూలుల్లాహ్)
5. తుది దినం (యౌముల్ ఖియామః)
6. మంచిగాని, చెడుగాని చేయడానికి శక్తి (అల్ ఖదర్) పరమశక్తిశాలి అయిన అల్లాహ్ నుండియే.
7. మరణానంతర జీవితం (అల్ ఆఖర)

ఒక ముస్లిం ఈ సప్త విషయాలను నమ్ముతాడు. అరబీలో విశ్వాస రాహిత్యాన్ని కుఫ్ర్ అని అంటారు. ఈ విషయాల పట్ల నమ్మకం లేనివారు అవిశ్వాసులు అనబడతారు.

ప్రతి ముస్లిం అల్ ఈమాన్ అల్ ముఫస్సిల్ తెలుసు కోవాలి. వాటిలోని అర్థాన్ని గ్రహించి, వాటి పట్ల పూర్తి నమ్మకం కలిగి ఉంటూ త్రికరణ శుద్ధిగా వాటిననుస రిస్తూ జీవితం గడపాలి.

# తౌహీద్

అల్లాహ్ ఒక్కడే.

దైవం పేరు అల్లాహ్, ఆయన ఒక్కడే, నిజప్రభువు కూడ.

అల్లాహ్‌కు పేర్లు అనేకం. ఆయనకు గుణవాచకాలున్నాయి.

ఒక ముస్లిం అల్లాహ్‌కు ఉన్న పేర్లను, ఆయన గుణగణాలను విశ్వసిస్తాడు. ఆయన ఆదేశాలను అంగీకరిస్తాడు.

ఒక ముస్లిం ఇలా అంటాడు:

آمَنْتُ بِاللّٰهِ كَمَا هُوَ بِأَسْمَائِهِ وَصِفَاتِهِ
وَقَبِلْتُ جَمِيعَ أَحْكَامِهِ

**"ఆమన్తు బిల్లాహి కమాహువ బిఅస్మాయిహీ వ సిఫాతిహీ వఖబిల్తు జమీఅ అహ్కామిహీ"**

దీనిని అరబీ భాషలో అల్ ఇమాన్ అల్ ముజ్మల్ అని అంటారు.

దీని అర్థం 'ముక్తసరి విశ్వాసం'

ఈ ముక్తసరి అర్థం ఇలా ఉంది:

**నేను అల్లాహ్‌ను ఆయన పేర్లతో ఆయన గుణగణాలతో ఆయన ఉన్నట్లుగ విశ్వసిస్తున్నా మరియు ఆయన ఆజ్ఞలను అంగీకరిస్తున్నా.**

అల్లాహ్‌కు అనేక పేర్లు గుణగణాల నామవాచకాలున్నాయి.

ఆయనకు ఉన్న కొన్ని పేర్లు గుణగణాలు ఇలా ఉన్నాయి.

అల్లాహ్ ఒక్కడే, ఆయన అల్ అహద్.

అల్ అహద్ అంటే 'ఒక్కడే, ఆయనకు ఆయనే సాటి.'

అల్లాహ్‌కు తల్లిదండ్రులు లేరు, సంతానం లేదు.

ఆయనకు బంధువులు లేరు, భాగస్వాములు లేరు.
ఆయనకు సాటి ఎవరూ లేరు. అల్లాహ్ నిత్యుడు, అస్సమద్.

అస్సమద్ అంటే నిరంతరం ఉండువాడు.

అల్లాహ్ అన్ని చోట్ల ఉన్నాడు.

ఆయన సతతం సర్వప్రదేశాల్లో ఉంటాడు.

అల్లాహ్ సృష్టికర్త, అల్ ఖాలిఖ్.

అల్ ఖాలిఖ్ అంటే సృష్టికర్త.

సర్వం సృష్టించింది అల్లాహ్ మాత్రమే.

అల్లాహ్ నిజ యజమాని, అల్ మాలిక్.

అల్ మాలిక్ అంటే తిరుగులేని యజమాని, నిజస్వామి.

అల్లాహ్ ప్రతిదానికి యజమాని.

ప్రతిదీ ఆయనకు చెందిందే.

అల్లాహ్ పోషణకర్త, అర్రబ్

అర్‌రబ్ అంటే పోషించేవాడు.

ప్రతి ఒక్కరిని పోషిస్తున్నది ఆయనే

జీవిత అవసరాలను తీరుస్తున్నది ఆయనే.

అల్లాహ్ మహాశక్తిశాలి, అల్ ఖదీర్

అల్ ఖదీర్ అంటే మహాబలోపేతుడు.

అల్లాహ్ శక్తి  సామర్థ్యాలు కలవాడు.

అల్లాహ్ రక్షకుడు, అల్‌వలీ.

అల్‌వలీ అంటే రక్షించే స్నేహితుడు.

అల్లాహ్ అందరిని రక్షిస్తాడు.

రక్షణ బాధ్యత వహిస్తాడు.

అల్లాహ్‌కు అన్నీ తెలుసు- అల్ అలీమ్.

అల్ అలీమ్ అంటే సర్వజ్ఞుడు.

అల్లాహ్‌కు అందరి

అంతః బాహ్యాలు తెలుసు.

అల్లాహ్ పర్యవేక్షకుడు అర్ రఖీబ్.

అర్ రఖీబ్ అంటే జాగ్రత్తగా చూచుకొనేవాడు.

అన్ని సమయాలలో అందరిని

అల్లాహ్ జాగ్రత్తగా చూస్తున్నాడు.

కాని ఎవరు ఆయన్ను చూడలేరు.

అల్లాహ్ దయామయుడు - అర్ రహమాన్.

అర్ రహమాన్ అంటే అమిత దయామయుడు.

అల్లాహ్ అందరిని దయతో ఆదరిస్తాడు.

అల్లాహ్ కరుణించేవాడు అర్ రహీమ్

అర్ రహీమ్ అంటే అమిత కరుణామయుడు.

అల్లాహ్ కరుణ అపారం. అందరికి ఉంది ఈ కరుణ.

అల్లాహ్‌కు ఇంకెన్నో సుందరమైన పేర్లున్నాయి.

ఆయనకు ఎన్నో గుణగణాల పేర్లున్నాయి.

ముస్లిం అల్లాహ్ పేర్ల పట్ల

గుణగణాల పట్ల ప్రగాఢ విశ్వాసం కలిగి ఉన్నాడు.

అంతేకాదు

ఆయన ఆదేశాలను ఆలకించి పాలిస్తాడు కూడా.

# దైవదూతలు (అల్ మలాయికహ్)

మలాయికహ్ ఒక అరబీ పదం. మలాయిక అంటే దేవదూతలు. దైవదూతలు అల్లాహ్ సృష్టితాలు. వారు ప్రత్యేకంగా సృష్టించబడ్డారు. వారు దివ్యవెలుగుతో సృష్టించ బడ్డారు. ఆ వెలుగును అరబ్బీలో 'నూర్' అని అంటారు.

దివ్యవెలుగుతో సృష్టించబడ్డ ఈ దైవదూతలు ప్రత్యేక పనుల కోసం ఉన్నారు. విధినిర్వహణ కోసం వారికి ప్రత్యేక అధికారాలు ఉన్నాయి. అల్లాహ్ పట్ల విధేయులై ఉండడం వారి స్వభావం.

నిరంతరం వారు అల్లాహ్‌ను కొనియాడుతుంటారు . అల్లాహ్‌నే ఆరాధిస్తుంటారు. అల్లాహ్‌నే సేవిస్తుంటారు.

దైవదూతల్లో లింగ విబేధాలు లేవు. వారు పురుషులుకారు మహిళలు కూడాకారు. వారికి తల్లిదండ్రులుకాని, సంతానం కాని, బంధువులు కాని లేరు. వారికి నిద్రాహార కొరతలు లేవు.

వారి విశిష్టత ప్రత్యేక పనుల నిర్వహణ, ప్రత్యేక రూపురేఖలు కలిగి ఉండడం.

దేవదూతలు అనేకులు. కొందరి పేర్లు దివ్యఖుర్ఆన్‌లో చెప్ప బడ్డాయి.

కొందరి దైవదూతల పేర్లు :

| అరబ్బీ భాషలో | ఆంగ్లంలో |
|---|---|
| 1. జిబ్రాయీల్ అలైహిస్సలాం | గేబ్రియల్ |
| 2. మికాయిల్ అలైహిస్సలాం | మైఖేల్ |
| 3. ఇజ్రాయీల్ అలైహిస్సలాం | అజ్రైల్ |
| 4. ఇస్రాఫీల్ అలైహిస్సలాం | అస్రాఫీల్ |

అల్లాహ్ సృష్టించిన దైవదూతలందరిపై ముస్లింలు విశ్వాసం కలిగి ఉన్నారు.

# దైవదూతలు - అల్లాహ్‌కు విధేయులు

దైవదూతల పట్ల ముస్లింలు విశ్వాసం కలిగి ఉన్నారు. వారికి ప్రత్యేక పనులు కేటాయించబడ్డాయి.

జిబ్రాయిల్ అలైహిస్సలాం ప్రవక్తలకు దైవసందేశాన్ని అందించారు. ఖుర్‌ఆన్ దైవసందేశం. మానవులందరికోసం అవతరించబడ్డది.

జిబ్రాయిల్ అలైహిస్సలాం ఖుర్‌ఆన్ గ్రంథాన్ని అల్లాహ్ నుండి మహాప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంపై అవతరింప జేశారు.

మహాప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అనేక పర్యాయాలు జిబ్రాయిల్ అలైహిస్సలాంను చూచారు.

మీకాయిల్ అలైహిస్సలాం దైవదూత అల్లాహ్ ఆజ్ఞలను పొంది వర్షాన్ని కురిపిస్తారు. ఇజ్రాయిల్ అలైహిస్సలాం దైవదూత. మానవ దేహాల నుండి వారి జీవాత్మలను తీస్తారు. జీవాత్మలు పోయాయంటే మానవులు మృతులౌతారు.

సజీవంగ ఉన్న అన్నిటికి మరణం తెచ్చిపెట్టుతారు ఇజ్రాయిల్ అలైహిస్సలాం. ఇజ్రాయిల్ అలైహిస్సలాంకు మలకుల్‌మౌత్ అని కూడా అంటారు.

మలకుల్ మౌత్ అంటే మరణం తెచ్చిపెట్టే దైవదూత. ఇజ్రాయిల్ అలైహిస్సలాం ముస్లింలకు స్వర్గపు శుభవార్తను ఇస్తారు.

స్వర్గాన్ని అరబ్బీలో 'జన్నత్' అని అంటారు. ఇస్రాఫీల్ అస్సూర్ అనే శబ్దం రెండుసార్లు చేస్తారు. 'అస్సూర్' అరబ్బీ పదం. దీని అర్థం గొప్ప శబ్దం. మొదటి శబ్దంతో ప్రపంచం అంతమౌతుంది.

రెండవ మహాధ్వని వినిపించినతోడనే మృత్యువులందరు మేల్కొంటారు. వారందరు తీర్పు దినం కోసం సమావేశమౌతారు.

ప్రతి మనిషిపై నిఘాపెట్టి ఉండడానికి అల్లాహ్ ఇద్దరు దైవదూత లను నియమించాడు.

ఈ ఇద్దరి పేర్లు; రఖీబ్ మరియు ఆతిద్. వారు మనిషి చేసే ప్రతి పనిని, చెప్పే ప్రతిమాటను పొందు పరుస్తారు. వారిరువురిని 'కిరామన్‌కాతిబీన్' అని అంటారు.

'కిరామన్ కాతిబీన్' అరబ్బీ పదజాలం, దీని అర్థం గౌరవనీయ గ్రంథస్థం చేసేవారు. వారిరువురిలో ఒకరు మనిషి మాట్లాడే మంచి మాటలను, చేసే మంచి పనులను రికార్డు చేస్తారు.

రెండవ వారు మనిషి చెప్పే చెడు మాటలను, చెడు పనులను వ్రాసి పెట్టుతారు. ఈ పొందుపరచిన సమాచారాన్ని మనిషి పరిష్కార దినాన దైవానికి సమర్పిస్తారు.

సమాధి చేరే ప్రతి మనిషికి ప్రశ్నించమని దైవం ఇరువురు దైవదూతల్ని ఆజ్ఞాపిస్తాడు. వారిరువురి పేర్లు మున్‌కర్ మరియు నకీర్.

**వారు అడిగే ప్రశ్నలు:**

మీ దైవం, పోషకుడు ఎవరు?

మీ ధర్మం ఏది?

మీ ప్రవక్త ఎవరు?

మీ గ్రంథం ఏది?

సద్ధర్మ పరాయణులైన ముస్లింలు; మా దైవం అల్లాహ్ అనీ,

మా ధర్మం ఇస్లాం అనీ, మా ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం అనీ, మా గ్రంథం దివ్యఖుర్‌ఆన్ గ్రంథం అని జవాబిస్తారు.

సత్య ముస్లింలను స్వర్గానికి ఆహ్వానించడానికి అల్లాహ్ కొందరు దైవదూతల్ని నియమించాడు.

పాపాత్ములను నరకంలో పడేయడానికి అల్లాహ్ మరికొందరు దైవదూతల్ని నియమించాడు.

ఇంకా ఎందరో దేవదూతలున్నారు. అల్లాహ్ ఆజ్ఞల్ని వారు నిరంతరం శిరసావహిస్తుంటారు. దైవదూతలందరూ అల్లాహ్‌కు పరిపూర్ణ విధేయులై ఉన్నారు.

# అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాలు

అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాలను 'కుతుబ్ అల్లాహ్' అని అరబ్బీ భాషలో అంటారు.

'కుతుబ్ అల్లాహ్'ను అల్లాహ్ అవతరింపజేశాడు.

ఏది ఉత్తమోత్తమో అది ప్రజలకు తెలియపరుచడానికి దైవగ్రంథాలు అవతరించబడ్డాయి.

దైవ ప్రసాదితములైన ఈ గ్రంథాలననుసరించి జీవించడం వల్ల మానవుల జీవితాలు సఫలమౌతాయి.

దైవగ్రంథాలు వివిధ కాలాలలో ప్రజానీకానికి దారి చూపించడానికి పంపబడ్డాయి. ఈ మార్గదర్శక గ్రంథాలన్నిటి పట్ల ముస్లింలు విశ్వాసం కలిగి ఉన్నారు.

ఈ గ్రంథావతరణం ఎలా జరిగింది?

అందుకోసం అల్లాహ్ కొందరిని ఎన్నుకొన్నాడు. వారు అల్లాహ్ సందేశ ప్రచారకులు, వార్తావహులు కూడ.

అవతరణానంతరం అల్లాహ్ సందేశాన్ని వారు గ్రంథస్థం చేశారు.

**అల్లాహ్ అవతరింపజేసిన కొన్ని గ్రంథాల పేర్లు:**

| | |
|---|---|
| సుహూఫ్ | ఆంగ్లంలో స్క్రోల్స్ ( Scrolls) అని అంటారు. |
| తౌరాత్ | ఆంగ్లంలో తోరాహ్ (Torah) అని అంటారు. |
| జబూర్ | ఆంగ్లంలో సామ్స్ (Psalms) అని అంటారు. |
| ఇంజీల్ | ఆంగ్లంలో గాస్పెల్ (Gospel) అని అంటారు. |
| ఖుర్ఆన్ | ఆంగ్లంలో ఖుర్ఆన్ (Quran) అని అంటారు. |

ఈ గ్రంథాలన్నిటిని అవి దైవం పంపిన గ్రంథాలని ముస్లింలు నమ్ముతారు. కాని కాలక్రమేణ కొన్ని గ్రంథాలు కనుమరుగయ్యాయి.

సుహూఫ్ మరియు జబూర్ ఇప్పుడు లేవు. ప్రజలు వాటి పట్ల జాగ్రత్త వహించలేదు. అవి మన చేతుల్లో ఇప్పుడు లేవు.

కొన్ని గ్రంథాలలో మార్పులొచ్చాయి. మానవులే ఆ మార్పులు చేర్పులు చేశారు. మనిషి భావాలు అందులో వచ్చిపడ్డాయి. ఇలా మార్చబడిన వాటిలో తౌరాతు, ఇంజీలు గ్రంథాలున్నాయి.

దివ్యఖుర్ఆన్ చిట్టచివరి దైవగ్రంథం. దైవదూత జిబ్రాయీల్ (అలైహిస్సలాం) ఖుర్ఆన్ గ్రంథాన్ని అల్లాహ్ నుండి తెచ్చి మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) పై అవతరింపజేశారు.

ఖుర్ఆన్ గ్రంథం అరబ్బీ భాషలో అవతరించబడ్డది. ఖుర్ఆన్ గ్రంథ ప్రత్యేకత ఇందులోని ప్రతిపదం, ప్రతి అక్షరం సురక్షితంగ ఉంది.

అల్లాహ్ ఈ గ్రంథాన్ని సంరక్షించాడు. ఖుర్ఆన్ ఒక్కటే ఇప్పుడు మార్పులు లేని దైవగ్రంథం. ఎప్పటికీ ఇది సురక్షితంగ ఉంటుంది కూడ. ఈ రక్షణ బాధ్యత అల్లాహ్ స్వయంగ స్వీకరించడమయింది.

ఖుర్ఆన్ హితోపదేశ గ్రంథం. మానవులకు చక్కటి మార్గం చూపే గ్రంథం. మంచి చెడుల మధ్య ఉన్న వ్యత్యాసం చూపే గ్రంథం.

ఖుర్ఆన్ అవతరణ ఉద్దేశం చిరకాలం మానవులందరికి మంచి మార్గం చూపడానికే.

ఇది దైవం పంపిన చిట్టచివరి గ్రంథం. ఖుర్ఆన్ అల్లాహ్ పలికిన సత్యం అని ముస్లింలు విశ్వసిస్తున్నారు. అల్లాహ్‌కు విధేయులై ఉండాలని, ఎప్పుడు మంచి పనులే చేస్తుండాలని, చెడుకు దూరంగా ఉండాలని ఖుర్ఆన్ మనందరికి హితవు పలుకుతుంది.

# అల్లాహ్ ప్రవక్తలు

'రసూలుల్లాహ్' అరబ్బీ భాషలో ఉంది. దీని అర్థం అల్లాహ్ సందేశ వహులు. అదే విధంగా 'నబీ అల్లాహ్' కూడ అరబ్బీ భాష.

దీని అర్థం అల్లాహ్ ప్రవక్త. దైవప్రవక్త అల్లాహ్‌కు దాసుడు, దైవసందేశవహుడు కూడ.

ఆయన మనలాంటి మనిషి మాత్రుడే. అల్లాహ్‌కు భాగస్వామికాడు.

అల్లాహ్‌కు బంధువు, సంతానం కానేకాడు. ప్రవక్తను అల్లాహ్ ఎన్నుకొన్నాడు. అల్లాహ్ నుండి సందేశం అందుకొని ఆ సందేశాన్ని ప్రజల వరకు చేరుస్తాడు ప్రవక్త. అల్లాహ్ ఆదేశానుసారం జీవితం గడుపుతాడు, ఆ హితవులను ప్రజలకు ప్రబోధిస్తాడు అల్లాహ్ ఎంతో మంది ప్రవక్తల్ని పంపాడు. వారి పేర్లు అన్నీ మాకు తెలియవు. కాని కొంతమంది ప్రవక్తల ప్రస్తావన ఖుర్‌ఆనులో ఉంది.

సుప్రసిద్ధ ప్రవక్తల పేర్లు:

| ఖుర్‌ఆన్‌లో ఉన్న పేరు | ఆంగ్లంలో ఉన్న పేరు |
|---|---|
| ఆదం (అలైహిస్సలాం) | Adam (ఆదము) |
| నూహ్ (అలైహిస్సలాం) | Noah (నూహ్) |
| సాలిహ్ (అలైహిస్సలాం) | Salih (సాలెహ) |
| ఇబ్రాహీం (అలైహిస్సలాం) | Abraham (ఇబ్రాహీము) |
| ఇస్మాయీల్ (అలైహిస్సలాం) | Ismael (ఇస్మాయీల్) |
| ఇస్హాఖ్ (అలైహిస్సలాం) | Issac (ఇస్హాఖ్) |
| యాఖూబ్ (అలైహిస్సలాం) | Jacob (యాఖూబ్) |

| | |
|---|---|
| యూసుఫ్ (అలైహిస్సలాం) | Joseph (యూసుఫ్) |
| మూసా (అలైహిస్సలాం) | Moses (మూసా) |
| దావూద్ (అలైహిస్సలాం) | David (దావూద్) |
| యహ్యా (అలైహిస్సలాం) | John (యహ్యా) |
| ఈసా (అలైహిస్సలాం) | Jesus (ఈసా) |

ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)
Muhammad (ముహమ్మద్)

ఈ ప్రవక్తలందరి పట్ల ముస్లింలు విశ్వాసం కలిగి ఉన్నారు.

కొందరు ప్రవక్తలు అల్లాహ్ చట్టాలను పొందారు.

ఈ చట్టాలను వినయ విధేయతలతో పాటించడం మానవ కర్తవ్యం.

అల్లాహ్ ఏ ప్రవక్తలకు చట్టాలనిచ్చాడో వారిని రసూలుల్లాహ్ దైవసందేశవహులు అని అంటారు.

**దైవగ్రంథంలో పేర్కొనబడ్డ అల్లాహ్ సందేశవహులు:**

| దైవగ్రంథంలోని పేరు | ఆంగ్లంలో వారి పేరు |
|---|---|
| ఇబ్రాహీం (అలైహిస్సలాం) | Abraham (ఇబ్రాహీం) |
| మూసా (అలైహిస్సలాం) | Moses (మూసా) |
| దావూద్ (అలైహిస్సలాం) | David (దావూద్) |
| ఇసా (అలైహిస్సలాం) | Jesus (ఈసా) |

ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)
Muhammad (ముహమ్మద్)

ముస్లింలు ఈ సందేశవహులందరిపై విశ్వాసం కలిగి ఉన్నారు. ఈ దైవప్రవక్తలందరికీ దైవచట్టాలు ఇవ్వబడ్డాయి. ఆ చట్టాలన్నిటినీ వారు గ్రంథస్థం చేశారు.

**అల్లాహ్ పంపిన కొన్ని గ్రంథాల పేర్లు**

| ప్రవక్త పేరు | ఇవ్వబడిన గ్రంథం |
|---|---|
| ఇబ్రాహీం (Abraham) | సుహూఫ్ (Scroll) |
| మూసా (Moses) | తౌరాతు (Torah) |
| దావూద్ (David) | జబూర్ (Psalms) |
| ఈసా (Jesus) | ఇంజీల్ (Gospel) |
| ముహమ్మద్ (Muhammad) | ఖుర్ఆన్ (Quran) |

ప్రవక్తల్ని అల్లాహ్ ప్రతి మానవ జాతిలో పంపాడు. ప్రజలకు హితవు పలుకడానికి వారిని పంపించాడు ప్రభువు.

ప్రవక్తలు అల్లాహ్ తెలిపిన చక్కటి మార్గాన్ని ప్రజలకు తెలియజేశారు, ఆదర్శంగ నిలిచారు. శిక్షణ ఇస్తూ జీవితం గడిపారు.

ప్రవక్తలు, దైవసందేశమణులు ఒకే ఒక సందేశం ప్రజలకు ఇచ్చారు.

అల్లాహ్ తప్ప ఇతర ఆరాధ్య దైవం లేడు. (లా ఇలాహ ఇల్లల్లాహ్)

# అల్లాహ్ ప్రవక్తలు

ముహమ్మద్ (సఅస)ను అల్లాహ్ తన ప్రవక్తగా, సందేశవహునిగా ఎన్నుకొన్నాడు. చిరకాలం వరకు మానవాళికి చక్కటి మార్గం చూపించడమే ఆయన బాధ్యత.

ప్రవక్తలలో చిట్టచివరి ప్రవక్త ముహమ్మద్ (సఅసం).

ఆయన్ను ఖాతిమున్నబీయ్యీన్ అని అంటారు.

ఖాతిమున్నబీయ్యీన్ అరబీ పదం. అంటే ఆయన చివరి ప్రవక్త, తరువాత ఏ ప్రవక్త రాబోడు అని అర్థం.

ప్రవక్తల రాక ముహమ్మద్ (సఅస)తో ముగిసింది.

మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) అనన్య ఆదర్శం కలవారు.

ఆయన జీవితం మానవాళికి పరిపూర్ణ దృష్టాంతం.

ప్రతి ముస్లిం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) పట్ల ప్రగాఢ ప్రేమ కలిగి ఉన్నాడు.

ఆయన ప్రజలకు ప్రబోధించింది ఏమిటి?

అల్లాహ్ పట్ల మన విధేయతలు ఎలా ఉండాలి;

అల్లాహ్ ఆరాధన ఎలా చెయ్యాలి, మనం చేసే మంచి పనులు ఏమిటి, చెడుకు మనం ఏ విధంగా దూరంగ ఉండాలి,

ప్రజలు ఇహపరాలలో విజయోన్ముఖులు కావాలంటే ఏమిచేయాలి,

ఏమి చేయకూడదు అన్న విషయాలన్నీ మహాప్రవక్త తెలియజేశారు.

ప్రతి ముస్లిం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) చూపిన మార్గాన్నే అనుసరించ ప్రయత్నిస్తాడు.

# యౌముల్ ఖియామ (తీర్పు దినం)

యౌముల్ ఖియామ అరబీ సమాసం. దీని అర్థం 'తీర్పుదినం.'

తీర్పు దినానికి పర్యాయ పదం చివరి దినం అని కూడ ఉంది.

చివరి దినం పట్ల ముస్లింలకు విశ్వాసం ఉంది.

అల్లాహ్ సృష్టించిన సర్వసృష్టి చివరి దినాన అంతమవుతుంది.

కేవలం అల్లాహ్ ఒక్కడే ఉంటాడు.

చివరి దినం ఎప్పుడు దాపురిస్తుంది అనే విషయం అల్లాహ్ ఒక్కనికే తెలుసు. ఆ సమయం ఆసన్నమౌతునే ఇస్రాఫీల్ మహా శంఖారావం చేస్తాడు. ఆ మహాధ్వని వింటూనే ప్రతిదీ కుప్పకూలుతుంది. విశ్వం తన ప్రమాణం కోల్పోతుంది. ప్రతిదీ అంతమౌతుంది.

అల్లాహ్ అద్వితీయ శక్తిశాలి. వినాశ మొందిన ప్రతిదానికి పునఃసృష్టి ప్రసాదిస్తాడు. అల్లాహ్ అందరినీ సజీవ పరుస్తాడు. ప్రతి ఒక్కరు అల్లాహ్ సమక్షంలో హాజరౌతారు.

అప్పుడు అల్లాహ్ ప్రతి ఒక్కరి నుండి వారివారి కార్యాచరణాల లెక్క తీసుకొంటాడు. తీర్పుదినాన్న సర్వన్యాయాధిపతి అల్లాహ్ ఒక్కడే.

మనిషి విశ్వాసాన్ని బట్టి అల్లాహ్ తీర్పునిస్తాడు. మనిషి జీవితంలో చేసిన పనులను ఆచితూచి అల్లాహ్ తీర్పు నిస్తాడు. ఆ దినం

ఎవరూ ఎవరికి సహాయపడలేరు, అల్లాహ్ ఇచ్చిన తీర్పు తుదితీర్పు అవుతుంది.

ఇస్లామి విశ్వాసాల పట్ల నమ్మకం కలిగి
మంచి పనులు చేసిన వారికి దైవానుగ్రహం కల్గుతుంది.

వారికి బహుమతులుంటాయి. అల్లాహ్ పట్ల అవిశ్వాసం కలిగి చెడు పనులు చేసిన వారికి దైవాగ్రహం కల్గుతుంది, వారికి శిక్ష ఉంటుంది.

# అల్-ఖదర్ (మంచి చెడులు చేసే శక్తి)

అల్-ఖదర్ ఒక అరబ్బీ పదం. దీని అర్థం శక్తి. ఏదైన చేయడానికి కావలసిన శక్తి అల్లాహ్ ప్రసాదిస్తాడు. అల్లాహ్ సర్వశక్తిశాలి. పనులన్నీ చేయడానికి అల్లాహ్ శక్తిశాలి. ప్రతిదీ ఆయన అనుమతితోనే జరుగుతుంది.

ముస్లిం అల్ ఖదర్‌పై విశ్వాసం కలిగి ఉన్నాడు. విశ్వవస్తువులన్నీ అల్లాహ్ అధీనంలోనే ఉన్నాయి. ఆయన ఇచ్చిన శక్తి, అనుమతు లననుసరించే అవన్నీ నడుస్తున్నాయి.

ప్రతి వస్తువునకు అల్లాహ్ కారణభూతుడు. మంచి చెడుల రెండింటికి ఒక కారణమంటూ ఉంటుంది. అల్లాహ్ నిశ్చిత ఆజ్ఞను అనుసరించే మంచి చెడులు ఉనికిలో ఉన్నాయి.

అల్లాహ్ సూచనలననుసరించి చేయబడిన ప్రతి పని శ్రేయోదాయక మౌతుంది, శుభాన్నిస్తుంది. అల్లాహ్ చూపిన సూచనలకు అభి ముఖంగా చేసిన పనులన్నీ చెడుగాను, దాష్టికాలుగాను అవుతాయి. చెడులు మరియు దాష్టికాలు పాపాలనబడుతాయి.

అల్లాహ్ మనిషికి స్వేచ్ఛ స్వాతంత్రాలనిచ్చాడు. అతడు మంచినైన చెడునైన ఎన్నుకోవచ్చు. దానికి వారే బాధ్యులు. మనిషి తనకివ్వ బడిన శక్తిని మంచికైన చెడుకైన ఉపయోగించుకోగలడు.

మంచిని పెంచడానికి ఒక వ్యక్తి దైవం ఇచ్చిన శక్తిని ఉపయోగిస్తే,
అతను దైవ ప్రసన్నతికి అర్హుడౌతాడు.

అల్లాహ్ సహాయపడితేనే మంచి పనులు జరుగుతాయి కూడ.

ఎవరైతే అల్లాహ్ ప్రసాదించిన శక్తిని చెడు కోసం ఉపయోగిస్తాడో,
అతను దైవ అప్రసన్నతకు అర్హుడౌతాడు.

అల్లాహ్ అనుమతిస్తేనే చెడు జరుగడమౌతుంది కూడ.

# అల్ ఆఖిరహ్ (మరణానంతర జీవితం)

అల్లాహ్ సకల జీవరాసులకు ప్రాణప్రదాత.

ఇహలోక జీవితం పరిమిత జీవితం. అల్లాహ్ తలచినప్పుడు ప్రతి జీవి ప్రాణం తీసుకొంటాడు. అప్పుడు మరణం సంభవిస్తుంది. మరణంతో ప్రాపంచిక జీవితం అంతం అవుతుంది.

మరణానంతరం ప్రతి మనిషికి మళ్ళీ జీవం ప్రసాదిస్తాడు దేవుడు

ఒక వ్యక్తి నిజజీవితం మరణానంతరమే ప్రారంభమౌతుంది. అదో క్రొత్త ప్రపంచంలో మానవుడడుగిడుతాడు. ఈ క్రొత్త ప్రపంచం అల్-ఆఖిరహ్ అనబడుతుంది. అల్-ఆఖిరహ్ ఒక అరబ్బీ పదం. దీని అర్థం మరణానంతరం రాబోయే జీవితం. ఈ మరణా నంతర జీవితం నిత్యజీవితం. అల్-ఆఖిరహ్ పట్ల ముస్లింలకు విశ్వాసం ఉంది.

ప్రళయం తరువాత సంభవించే తీర్పుదినాన్న మనిషికి తీర్పు ఇవ్వ బడుతుంది. విశ్వాసం కల వ్యక్తి చేసిన మంచి పనులకు అతడు స్వర్గం అలంకరిస్తాడు. స్వర్గం శాంతికి సంతోషానికి నిత్యనిలయం. స్వర్గ ప్రవేశకులకు కోరిన వస్తువులన్నీ అక్కడ ఉంటాయి. స్వర్గం అలంకరించిన వ్యక్తికి అల్లాహ్ కరుణ ఉంటుంది. ఆయన నిండు తోడ్పాటు ఉంటుంది. స్వర్గవాసులు అక్కడే ఎప్పటికి ఉంటారు.

అవిశ్వాసులు అల్లాహ్ ఆగ్రహానికి పాత్రులౌతారు. వారు చెడు చేస్తూ ప్రపంచంలో జీవితాన్ని వినాశంపాలు చేసుకొంటారు. అలాంటి వారు నరకానికి చేర్చబడు తారు. దానినే అరబ్బీలో 'జహన్నం' అని అంటారు. నరకం దుర్భర బాధలకు నిలయం. చేతులారా చేసిన చెడులకు వారు నరక యాతన అనుభవించాల్సి ఉంటుంది. నరకం బాధలకు నిత్యనిలయం.

# విశ్వాసవంతుల గుణగణాలు

విశ్వాసం కల ముస్లింలు మంచిగుణగణాలు కలిగి ఉండాలి.

సద్గుణ విహీనం విశ్వాస లక్ష్యం కాదు.

**విశ్వాసుల ప్రముఖ గుణం:**

లా ఇలాహ ఇల్లల్లాహ్

అల్లాహ్ తప్ప మరే దేముడు లేడు.

విశ్వాసునికి ఉండాల్సిన సుగుణాలలో కనీస గుణం

దారిలో ఉన్న హానికర వస్తువుల్ని తొలిగించడం.

సిగ్గు, బిడియం కలిగి ఉండడం.

చెడు పనులు చేయకుండా ఉండడం విశ్వాసపు విభాగాలే.

ఇంకా కొన్ని విశ్వాసపు గుణగణాలు ఇలా ఉన్నాయి:

ప్రతి విశ్వాసిలో ఈ గుణాలు సహజంగానే ఉండాలి.

1. అల్లాహ్ పట్ల ప్రేమ కలిగి ఉంటూ ఆయనంటే భయపడడం
2. ముహమ్మద్ (సఅసం)ను అమితంగ ప్రేమించడం
3. అల్లాహ్ కోసమే ఇతరులను ప్రేమించడం లేదా విద్వేషించడం

4. ప్రతీదీ అల్లాహ్ సంతోషం పొందడానికే చెయ్యడం.

5. తప్పులు చేస్తే, పాపపు పనులు దొర్లిపోతే చేసిన పనులకు పశ్చాత్తాప పడడం.

6. అల్లాహ్ ఇచ్చిన దానితో తృప్తిపడడం.

7. ఓర్పు సహనాలతో మెలగడం.

8. ఇతరుల పట్ల దయాదాక్షిణ్యాలు కలిగి ఉండడం.

9. అల్లాహ్‌పై విశ్వాసం కలిగి ఉండడం.

10. అల్లాహ్ కృపాదరణాలపై విశ్వాసం కలిగి ఉండడం.

11. అల్లాహ్‌పై ఎప్పుడు ఆధారపడి ఉండడం.

12. అనవసరంగ ఇతరులపై కోపపడకుండ ఉండడం

13. ఇతరులకు హాని కలుగాలని అపేక్ష పడకుండా ఉండడం.

ఒక ముస్లిం ఇతరులకు ఆదర్శంగ ఉండాలని, విశ్వాసం వల్ల ఒనగూడే మంచిని పొందాలని కోరుకోవాలి.

# ఇబాదహ్ (ఆరాధనలు)

అల్లాహ్ విశ్వాన్ని సృష్టించాడు. అందులోని ప్రతిదీ ఆయనే సృష్టిం చాడు. మానవుల్ని కూడ ఆయనే సృష్టించాడు. మానవుల్ని సృష్టించింది కేవలం ఆయన్నే ఆరాధించడానికి. అల్లాహ్‌ను ఆరాధిస్తే వారు మంచి జీవితం గడుపుతారు.

'ఇబాదహ్' ఒక అరబ్బీ పదం.

దీని అర్థం అల్లాహ్‌ను అర్థించడం, స్తుతించడం, ప్రార్థిం చడం, ఆరాధించడం. అల్లాహ్ ప్రీతి పొందడానికి చేసిన ప్రతి పని ఆరాధన అవుతుంది.

అల్లాహ్ ప్రీతిని ఎలా పొందగలం?

ఆయన్ను ఆరాధించడం వల్ల,

ఆయన పట్ల విధేయత కలిగి ఉండడం వల్ల,

ఆయనను ప్రేమించడం వల్ల,

ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకోవడం వల్ల,

మనం అల్లాహ్ ప్రీతిని పొందుతాం, ఆయన్నే ఆరాధిస్తాం.

అల్లాహ్ ఆజ్ఞలను అనుసరించడం వల్ల అల్లాహ్ మనలను దగ్గర చేర్చుకొంటాడు, అదే ఆరాధన అనబడుతుంది.

ఆరాధన విధానాల్ని మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) తాను ఆచరిస్తూ మనకు చూపారు. అందువలననే మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) చూపిన మార్గాన అల్లాహ్ పట్ల ప్రగాఢ విధేయత కలిగి, ఆయన్నే ఆరాధించడాన్ని ఇస్లాం అంటారు.

ఈ ఇస్లాం ఐదు విషయాలపై ఆధారపడింది.

1. అల్లాహ్ తప్ప ఇతర ఆరాధ్య దైవం లేదని, ముహమ్మద్(స) ఆయన సందేశవహుడని త్రికరణశుద్ధిగా ప్రకటించడం.
2. నమాజు చెయ్యడం
3. జకాతును చెల్లించడం
4. హజ్ చెయ్యడం
5. రమజాను మాసంలో ఉపవాసవ్రతాన్ని పాటించడం.

   వీటినే షహాదత్, సలాత్, జకాత్, హజ్ మరియు సామ్ అని అంటారు. ఇవి ఇస్లాంకు మూలస్థంబాలు.

ఇస్లాం మహాసౌధం ఈ మూల స్థంభాలపై నిలబడింది.

1. షహాదత్ : ముస్లింల విశ్వాసం
2. సలాత్ : ప్రతిదినం చేసే ఐదుపూటల నమాజు
3. జకాహ్ : బీదలకు ఇచ్చే ధనం

4. హజ్ : మక్కాకు దైవారాధన కోసం ప్రయాణం

5. సౌమ్ : రమజాను మాసంలో చేసే ఉపవాసాలు

ప్రతి ముస్లిం ఈ ఆరాధనలను చెయ్యాలి. ఇవే ముస్లిం బాధ్యతలు. ఈ బాధ్యతలను నిర్వహించేవారు అంటే అల్లాహ్ సంతోషపడు తాడు. ఇవేగనక నిర్వహించకపోతే ఆ వ్యక్తి పట్ల అల్లాహ్ ఆగ్రహిస్తాడు. అతడు వినాశం పాలవుతాడు.

# సలాత్ (నమాజు)

సలాత్ ఒక అరబ్బీ పదం. దీని అర్థం అల్లాహ్ కోసం చేసే ఆరాధన. ముస్లింలు అల్లాహ్‌ను ఆరాధించే పద్ధతికి సలాత్ అంటారు.

సలాత్ ఆరాధనలలోకెల్లా ఉత్తమోత్తమమయిన పద్ధతి.
అల్లాహ్ స్మరణ అందులో ఉంది. దీనినే నమాజు అని అంటారు.
సలాత్ చేసే వ్యక్తి అల్లాహ్ ప్రీతికి పాత్రుడౌతాడు.
సలాత్ చేసేవారు అల్లాహ్‌కు చేరువగ ఉంటారు.

'సలాత్' చెయ్యమని అల్లాహ్ అందరిని ఆజ్ఞాపించాడు.

క్రమం తప్పకుండా నమాజు (సలాత్) చేసే వ్యక్తి అంటే అల్లాహ్‌కు ఎంతో ఇష్టం. నమాజు స్వర్గ ద్వారాన్ని తెరిచే కుంజీ. స్వర్గ ప్రవేశాన్ని చ్చేది నమాజు.

నమాజు చేసే పద్ధతిని మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) మనకు తెలియజేశారు. ఈ పద్ధతిని ముస్లింలు పాటిస్తూ నమాజు చేస్తారు. ఇందులోని ముఖ్యమైన విషయాలు.

నమాజు చేసే వ్యక్తి దుస్తులు, శరీరం పరిశుభ్రంగా ఉండాలి. నమాజు చేసే స్థలం పరిశుద్ధంగా ఉండాలి. వేళకు సరిగా చేయాలి

నమాజు. కాబా వైపు ముఖం త్రిప్పి చేయాలి నమాజు. కాబా అరేబియాలోని మక్కా మహానగరంలో ఉంది. నమాజుకు ముందు (నేను నమాజు చేస్తున్నానన్న) సంకల్పం చేసుకోవాలి. ప్రతి ముస్లిం ప్రతిదినం ఐదు పూటలు నమాజు చేయాలి.

ఈ ఆరాధనలు 'ఫరజ్' అనబడతాయి. అంటే తప్పనిసరిగా చేయ బడేవి అని అర్థం. వయసు వచ్చిన ప్రతి ముస్లిం ఐదుపూటల నమాజు వేళకు సరిగా చేయాల్సి వుంటుంది. ఇలా నమాజు చెయ్యడం ముస్లిం బాధ్యత.

ఐదుపూటలు చేసే ఫరజు నమాజుల పేర్లు వాటి వేళలు ఇస్తున్నాం:

ఫరజు నమాజులు

| | |
|---|---|
| 1. సలాతుల్ ఫరజ్ | ఉషోదయం సమయం |
| 2. సలాతుల్ జొహ్ర్ | మధ్యాహ్నం దాటిన తరువాత |
| 3. సలాతుల్ అస్ర్ | మధ్యాహ్న సమయం పూర్తిగ దాటాక |
| 4. సలాతుల్ మగ్రిబ్ | సూర్యాస్తమం అయిన వెంటనే |
| 5. సలాతుల్ ఇషా | రాత్రి సమయం. |

ఈ నమాజులు సామూహికంగా చేయడం అత్యుత్తమం. సామూ హికంగా చేయబడే ఈ ఆరాధనల్ని 'జమాఅత్' అని అంటారు.

'జమాఅత్' అరబ్బీ పదం; దీని అర్థం జనుల సమూహం. ఫరజు నమాజులు కాకుండ ఇంకా ఇతర అధికంగ చేయబడే నమాజు

లున్నాయి. ఇవి చేయడం వల్ల అల్లాహ్ కృపాదరణలను, బహు మానాలను అపారంగ పొందగలం.

'సలాత్' దైవస్మరణకు అత్యుత్తమ పద్ధతి. దైవారాధనకు పాటించా ల్సిన మంచి పద్ధతి కూడ. 'సలాత్' దైవ విధే యులుగ మనిషిని తీర్చిదిద్దుతాయి.

సలాత్ మానవుల్ని పరిశుభ్రంగా, నిష్కల్మషంగా, వేళకు సరిగా ఉండేట్లు చేస్తుంది.

## సౌమ్ (రమజాను మాసంలో పాటించే ఉపవాసాలు)

సౌమ్ ఒక అరబ్బీ పదం. దీని అర్థం తినడం నుండి దూరంగా ఉండడం. సౌమ్ అంటే ఉపవాసం.

ప్రాతఃకాలం నుండి సూర్యాస్తమయం వరకు ఏమీ తిన కుండా అన్నపానీయాలకు దూరంగ ఉండడం ఉప వాసమనబడుతుంది.

సౌమ్ ఒక ఆరాధన. ప్రతి వయస్సు వచ్చిన ముస్లిం రమ జాను మాసంలో తప్పని సరిగా పాటించదగినది ఉపవాస వ్రతం. ప్రజలు ఉపవాస వ్రతాన్ని పాటించాలని అల్లాహ్ ఆదేశాలిచ్చాడు.

ముస్లింలు ఈ ఉపవాసాన్నీ ఎలా పాటించాలన్న విషయాన్ని మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) సవివరంగా తెలియ జేశారు.

ఉపవాసవ్రతం చేసే పద్ధతి:

ప్రాతఃకాలాన ఉషోదయానికి ముందు ముస్లింలు మేల్కొం టారు. 'సహరి' అనబడు ఆహారాన్ని సేవిస్తారు.

సహరి అనేది కూడా అరబ్బీ పదం. ప్రాతఃకాలానికి ముందు సేవించే అల్పాహారాన్ని సహరి అంటారు. సహరి సేవించే సమయంలో ఉపవాస సంకల్పం చేసుకోవాలి. ఉదయం చేసే నమాజు సూర్యో దయానికి ముందు సహరి చేశాక చేయాలి.

సహరి చేసిన తరువాత ఏలాంటి పదార్థాన్ని తినడం కాని, పానీయాన్ని సేవించడం కాని, ఇంకితరత్రా పొగ త్రాగడం కాని ఉండదు. ఇలా చేయడం నిషేధం. ముస్లింలు దినమంత ఉపవాసముంటారు సూర్యాస్త మయం కాగానే ఉపవాసాన్ని విరమిస్తారు. ముస్లింలు "ఇఫ్తార్" అనే స్వల్ప ఆహారంతో ఉపవాసాన్ని ముగించు కొంటారు. 'ఇఫ్తార్' అరబ్బీ పదం. దీని అర్థం ఉపవాసాన్ని విరమించడం. ఇఫ్తార్‌ను సేవించాక మగరిబ్ (సాయంత్రం) నమాజును చేసుకుంటారు. మగరిబ్ నమాజు తరువాత రాత్రి భోజనం చేయవచ్చు.

రమజాను మాసం శుభాల వసంతం. బంధువులు, మిత్రులు ఒకరినొకరు ఇఫ్తార్ కోసం మరియు డిన్నర్ కోసం ఆహ్వానించు కొంటుంటారు. కలసి మెలసి దైవా రాధనలు చేస్తూ అన్నపానీయాలు పంచుకొంటూ ఉండడం వల్ల అల్లాహ్ కరుణామృతం వారికి ఉంటుంది.

రమజాను ఒక ప్రత్యేక మాసం. దివ్యఖుర్‌ఆన్ అవతరణ ఈ మాసంలోనే ప్రారంభమయింది. రమజాను మాసంలో ముస్లింలు ఇతోధికంగా ఖుర్‌ఆన్ పారా యణం చేస్తారు. ఖుర్‌ఆన్ అవగాహనకు కృషి చేస్తారు.

తరావీ నమాజుల్లో ఖుర్‌ఆన్ పఠిస్తుంటే మనోలగ్నంతో వింటుంటారు ఆరాధకులు.

రమాజను మాసం చివర ఈదుల్ ఫితర్ పండుగ జరుపు కొంటారు ముస్లింలు. ఈదుల్ ఫితర్ పండుగ దైవానికి కృతజ్ఞత తెలుపుకొనే పర్వదినం. ముస్లింలు సామూహికంగా ఒకచోట సమావేశమై ఈదుల్ ఫితర్ నమాజు చేస్తారు. ఈ నమాజు ధ్యేయం దైవం ప్రసాదించిన శాంతి కరుణకు కృతజ్ఞత చెప్పు కోవడమే.

సౌమ్ అల్లాహ్ స్మరణకు ఉత్తమమైన విధానం. అల్లాహ్ పట్ల వినయ విధేయతల్ని నేర్పుతుంది సౌమ్. బీదసాదలు, లేమిననుభవించే వారి బ్రతుకులు ఏలా ఉంటాయన్న విషయాన్ని ప్రబోధిస్తుంది సౌమ్.

సౌమ్ ప్రజలకు మద్దతునిస్తుంది. సముపార్జనను అందరితోపాటు పంచుకొంటుంది. శాంతికి, సమారాధనకు సౌమ్ చిహ్నం.

# ప్రబోధన

మంచిమాట ప్రచారం చేయండి. అదే మంచిపని, అసలైన పని అదే.

ఇలా సందేశం ఇవ్వడం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు అలవాటు. దాని ప్రభావమే ఈనాటి సత్సమాజం.

మంచి మంచి పుస్తకాలున్నాయి. ఆణిముత్యాల్లాంటి మాటలు అందులో ఉన్నాయి. ఎన్నో సందర్భాలున్నాయి.

మాట మనుషులకందించడానికి ఆరాధనాలయాలలో ఉంటారు దైవదాసులు.

జల్సా చేసికొంటుంటారు అనేకులు. బజారులో ఉంటారు వ్యాపారస్థులు వేలకువేలు ఛుక్ ఛుక్ రైలు బండ్లో ప్రయాణం చేస్తుంటారు యాత్రికులు.

స్కూళ్ళలో, కాలేజీలో, యూనివర్శిటీలో ఉంటారు విద్యార్థులు కోకొల్లలు. ఆసుపత్రులలో ఉంటారు రోగులు. కారాగారాలలో ఉంటారు ఖైదీలు.

ప్రతిచోట ఉంటారు దైవం సృష్టించిన మానవులు. వేచి ఉంటారు ప్రభువు ప్రబోధించిన రుజుమార్గం కోసం. అన్ని సమయ సందర్భాలలో వినియోగించుకోండి అవకాశాలు.

రుజుమార్గం చూపే చిరుపుస్తకాలు పంచిపెట్టండి. అన్ని అవసరాలను తీర్చే హితోపదేశాలు ఉన్నాయి మా లిటరేచరులో. రండి! క్యాటలాగు తెప్పించుకోండి. ప్రారంభించిన పుస్తకం వదలకుండా చదువుతారు. మనస్సుకు శాంతి, జీవితానికి ధ్యేయం పొందుతారు

# హజ్

జిల్‌హజ్ మాసంలో హజ్ చేయబడుతుంది. హజ్ సందర్భంగ కొన్ని ఆరాధనా కార్యక్రమాలు చేయాల్సి ఉంది. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఈ పనులన్నీ మనకు నేర్పారు. జిల్‌హజ్ మాసంలో 8వ తేది నుండి 13వ తేది వరకు ప్రపంచ వ్యాప్తంగా హజ్ చేయసకల్పం కల ముస్లింలు హజ్ కోసం ప్రయాణం చేసి మక్కా మహానగరం చేరుకొంటారు.

ప్రతి ఏట లక్షలాది ముస్లింలు హజ్ ఆరాధనను పూర్తి చేసుకొంటారు. ప్రతి ముస్లిం ఒకే రీతితో హజ్ పూర్తి చేసికొంటాడు. హజ్ చేసే వారిని 'హాజీ' అంటారు. హాజీలు అల్లాహ్ ఆజ్ఞలను పాటిస్తూ హజ్ నిర్వహించుకొని స్వస్థలాలకు మరలుతారు.

హజ్ మనకు నేర్పే విషయాలు:

1. అల్లాహ్ సర్వవ్యక్తుల ప్రభువు.
2. అల్లాహ్‌నే ఆరాధించాలి

   ఆయన పట్ల విధేయత చూపాలి.
3. ముస్లింలు అల్లాహ్ పట్ల విశ్వాసంకల దాసులు.
4. ముస్లింలందరు ఒక ఉమ్మత్‌కు (సమాజానికి) చెందినవారు.
5. ముస్లింలందరు సోదరసోదరీమణులుగ ఉంటారు.

హజ్ సమయంలో కాకుండ సాలుపొడువున 'కాబ' గృహం చేరి అక్కడ చేసే ప్రక్రియను 'ఉమ్రా' అంటారు. ఉమ్రా అంటే 'చిన్న హజ్' అని అర్థం.

జిల్‌హజ్ మాసపు 10వ తేదీన హజ్ చేయని ప్రపంచ ముస్లింలు 'ఈదుల్ అజ్‌హా' అనే త్యాగనిరతికి సాక్ష్యం పలుకే పండుగ జరుపుకొంటారు.

ప్రవక్త హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) మరియు హజ్రత్ ఇస్మాయిల్ (అలైహిస్సలాం)ను స్మరించుకొంటూ త్యాగస్ఫూర్తితో ఈ పండుగ చేసుకొంటారు.

ఈదుల్ అజ్‌హా సందర్భంగ ప్రతి పట్టణం మరియు గ్రామంలో ముస్లింలు సమావేశమై ఈదుల్ అజ్‌హా నమాజు చేస్తారు.
నమాజు తరువాత గొఱ్ఱెలు, ఒంటెలు, మేకలు ఇంకితర మాంసాహార జంతువుల ఖుర్బానీ సమర్పించుకొంటారు ముస్లింలు.

ఖుర్బానీ మాంసాన్ని సొంత ఇంటికోసం బంధుమిత్రుల కోసం పేదసాదల కోసం వాడుతారు.

# ఇస్లాం ప్రబోధనలు

మానవుల్ని సృష్టించింది అల్లాహ్ మాత్రమే. మానవులు మంచి గుణగణాలతో సృష్టించబడ్డారు. అల్లాహ్ మానవులందరికి ఇస్లాం జీవితమార్గంగా పసందు చేశాడు. ఇస్లాం మంచి స్వభావం కల జీవిత మార్గం. మంచిని సాధించమని ఇస్లాం మానవుల్ని ప్రేరేపి స్తుంది. అంతేకాదు చెడుకు దూరంగా ఉండమని ఆదేశిస్తుంది కూడా. ముస్లిములందరు ఇస్లాం చూపే చక్కటి మార్గాన్నే పాటిస్తారు. ఇస్లాంలో ఉన్న ఐదు మూల స్థంభాలు మనలో మంచి నడవడి కను అలవాటు చేస్తాయి. ఇస్లాం మార్గం ముస్లింలకు శిరోధార్యం. ముస్లింలు నిత్యం చేయవలసిన కొన్ని మంచి పనులు ఇలా ఉన్నాయి.

- అల్లాహ్ పట్ల వినయవిధేయతలు కలిగి ఉండాలి.
- మహాప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పట్ల విధేయత చూపాలి.
- తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించాలి. వారికి విధే యులై ఉండాలి.
- ఇస్లాం ఇచ్చే విజ్ఞానాన్ని సముపార్జించాలి.
- నిత్యం సత్యం పలుకాలి.
- పరిశుభ్రత కలిగి ఉండాలి.
- శుభ్రమైన, సాధారణమైన శోభనిచ్చే దుస్తులు ధరించాలి.
- వేళకు సరిగా నమాజులు చేయాలి, సమయానికి సరిగ్గా అన్ని పనులు చేయాలి.

- అణుకువతో, సౌమ్య మనస్సుతో, ప్రేమాదరణలతో మెలగాలి.
- ఓర్పు, సహనం కలిగి ఉండాలి.
- పరులకు సహాయపడాలి.
- సత్సాంగత్యం కలిగి ఉండాలి.
- చేసిన తప్పులను ఒప్పుకోవాలి, వాటికి క్షమాపణ కోరుకోవాలి
- పాపపు పని ఏదైనా దొర్లిపోతే వెంటనే పశ్చాత్తాప పడాలి
- పరులు మనకోసం చేసిన మేలును మరువకుండా కృతజ్ఞతలు తెలుపుకోవాలి.

# ఇస్లాం ప్రబోధనలు

మంచి పనులు చేయడానికి ప్రోత్సహించే ఇస్లాం జీవిత విధానం చెడు పనులకు దూరంగా ఉండమని చెబుతూంది.

ఒక ముస్లిం :

అసత్యమాడరాదు  ఎవరికి మోసం చేయకూడదు.

మాటలతోకాని చేతలతోకాని  ఎవరికి కీడు చేయురాదు. కోపపడరాదు  తగవులాడరాదు.

చాడీలు చెప్పరాదు  ఎవరిని హింసించరాదు.

పరుల పట్ల అనుమానం వద్దు.

చెడు అలవాట్లు పాపపు పనులు మానుకోవాలి.

వృధా కాలక్షేపం చేయరాదు. మితిమీరి మాటలాడరాదు.

హద్దులు మీరి తినరాదు.

డబ్బుందని ఎక్కువగా ఖర్చుచేయడం మానేయాలి.

డాబుసరి అలవాటు మానేయాలి.

ఇస్లాం వ్యతిరేక పార్టీలకు వెళ్ళడం మానేయాలి.

ఉత్తమోత్తమ అలవాట్లను ఖుర్ఆన్ గ్రంథం ముస్లింలకు బోధి స్తుంది. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం), ఖుర్ఆన్ బోధన లను తు.చ. తప్పకుండా పాటించాలి.  మహాప్రవక్త (సఅసం) నడవడిక సాటి లేనిది అందరికీ ఆదర్శనీయమైనది.

ప్రతి ముస్లిం ఖుర్ఆన్‌లోని అల్లాహ్ ప్రబోధనలను, మహాప్రవక్త ముహమ్మద్ (స) ఆదర్శనీయ ఆచరణలను తప్పకుండా పాటించాలి. అప్పుడే ముస్లింలు అల్లాహ్ సంతృప్తిని పొందగలరు, జీవితాలను విజయవంతం చేసుకోగలరు.

మంచి పనులలో పరస్పరం సహకరించుకోవడానికి , పాపపు పనులకు దూరంగా ఉండడానికి  ఓ ప్రభూ మనందరికి సద్బుద్ధి ప్రసాదించు!

# హమ్ద్

అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్
అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్

అల్లాహ్‌యే అందరి దైవం
ఆయనకే చెల్లు మా దాస్యం

చేశాడు సృష్టి అంతా ఆయనే
ఇలలోన ఇచ్చాడు మనకంతా ఆయనే

అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్
అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్

తారల్లో చందమామ ఇచ్చాడు
పుష్పాలతో బృందావనాల నింపాడు
కొండలపై ఊటలు స్రవింపజేశాడు
మెట్టపల్లాలపై నదులు ప్రవహింపజేశాడు
భూమ్యాకాశాలపై ఎటు చూచినా ఉన్నాయి
మనోహర దృశ్యాలే కంటి కగుపడుతున్నాయి

అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్
అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్

అన్నదమ్ములు అమ్మానాన్నలు ఇచ్చాడు
వారందరితో గృహం స్వర్గధామం చేశాడు
పండ్లు స్వీట్లు ఉన్నాయి వారి నుండి మాకు
ప్రతిక్షణం ఆనందం కలుగుతుంది వారితో మాకు.

# నాత్-యె-షరీఫ్

ధర్మం తెలియని కాలంలో
దైవాన్ని మరచిన విశ్వంలో
మహామనిషి వచ్చారు, వచ్చారు
స్ఫూర్తితో ధర్మ ప్రబోధన చేశారు

ఎవరాయన?
మన ఆదర్శమూర్తి ముహమ్మద్
సల్లల్లాహు అలైహి వ సల్లమ్

మౌఢ్యం దౌష్ట్యాలతో పోరాడారు
హింసా దౌర్జన్యాలు సహించారు
నిత్యం సత్యం పలికారు
జగతిని వెలుగుతో నింపారు

ఎవరాయన?
మన విశ్వ నాయకుడు ముహమ్మద్
సల్లల్లాహు అలైహి వ సల్లమ్

మన ప్రభువాజ్ఞ వినిపించారు
మానవుణ్ణి మనిషిగ మలిచారు
ఖుర్ఆన్ గ్రంథం చేపట్టారు
ధరణిలో దైవధర్మం స్థాపించారు

ఎవరాయన?
మన ప్రియప్రవక్త ముహమ్మద్
సల్లల్లాహు అలైహి వ సల్లమ్

# దుఆ

ఓ ప్రభూ!

నా బాహువులలో బలం పెంచు

నా రక్తంలో ప్రేరణ కలిపించు

నా జీవితంలో ఉద్యమం ప్రసాదించు

నీ ధర్మం వ్యాపింపజేస్తాను

విశ్వాన్ని సన్మార్గంపై నడిపిస్తాను

నా పలుకులలో ఇవ్వు ప్రభావం

ప్రసాదించు నాకు విద్యాబలం

నేర్పించు నాకు నీ సాంకేతిక జ్ఞానం

నీ ధర్మం వ్యాపింపజేస్తాను

విశ్వాన్ని సన్మార్గంపై నడిపిస్తాను

కావాలని ఉంది నేను నీ పూజారి

ఉత్సుకత ఉంది ప్రాణదానం ఇవ్వాలని

ఓ ప్రభూ! చేసికో నన్ను నీ సిపాయి

నీ ధర్మం వ్యాపింపజేస్తాను

విశ్వాన్ని సన్మార్గంపై నడిపిస్తాను.

# దుఆ ( ప్రార్థన )

ఓ ప్రభూ!
జీవితమిచ్చావు, నా మీద దయచూపావు
సృష్టిలోనే శ్రేష్ఠునిగ నన్నాదరించావు

ఓ ప్రభూ!
తారలను చేశావు వెలుగుమయం
సూర్యచంద్రులకిచ్చావు కిరణ సముదాయం
నా ఆలోచనలను చెయ్యి ప్రకాశవంతం

ఓ ప్రభూ!
పుష్పగుచ్ఛాలకిచ్చావు తాజాదనం
విశ్వాసంతో నా హృదయాన్ని చేయి తేజోమయం

ఓ ప్రభూ!
నా జీవిత లక్ష్యానికివ్వు పరిమళం
దుష్టశక్తుల దాస్యాన్నుండి రక్షించు
దైవప్రవక్త విధేయత నాలో కలిగించు
దైవమార్గాన నాకు అమరగతి ప్రసాదించు

ఓ ప్రభూ!
నీవిచ్చావు నాకు సుఖం ఆనందం
ప్రసాదించు నాకు నీ ప్రసన్నతాభాగ్యం.

# స్తుతి

సూర్యచంద్రులను సృష్టించిందెవరు?
నక్షత్రాలకు వెలుగునిచ్చిందెవరు?
ఫల పుష్పాల తోటల్ని పెంచిందెవరు?
రంగు రంగుల పూలను వికసింపజేసిందెవరు?
అల్లాహ్! అల్లాహ్ మాత్రమే.

కోయిల పాట పాడింది, భ్రమరము గీతం వినిపించింది
మొగ్గల ఒడి నిండడానికి ముత్యాల మంచు కురిసింది
పొలాలన్నీ పచ్చని మైదానాలయ్యాయి
పర్వతాలపై మేఘాలలుముకొన్నాయి
సముద్రాలలో అలలు ఎత్తున లేచాయి
అడవుల్లో చెట్లు దట్టంగ పెరిగాయి
తోటల్లో ద్రాక్ష తీగలు అల్లుకొన్నాయి
పచ్చని తివాచీలుగ పరచబడ్డాయి.

సీతాకోక చిలుకకు రంగులెన్నో-అది గాలిలో ఎగిరే రీతులెన్నో
మనిషికిచ్చాడు దైవం బుద్ధిబలం
పరిశోధించి సంపాదించాడు అతను విజ్ఞానం.
మన దైవం అందిరి దైవం - ఇచ్చాడు సొగసైన ఈ వైనం

ఆయన ఆధీనంలోనే ఉంది అంతా మరణమైనా,
జీవనమైనా.

రాజ పీఠంపై కోరినవారిని కూర్చోబెట్టడం

తాను తలచినవారిని దించివేయడం

ఎవరైతే ఆయనకు అయ్యారో సొంతం

ఏమని చెప్పాలి వారి అదృష్టం.

ఓ జగదేక ప్రభూ! జాపాము చేతులు నీ ముందు

కరుణించు ప్రసాదించు నీ కానుక.